ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 28 జూన్ , 2026 | పేజీలు : 6

## హ్యాం ప్రాజెక్టుల శంకుస్థాపనకు మంత్రి సీతక్కకు కోమటిరెడ్డి ఆహ్వానం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ నియోజకవర్గంలో సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరిగే హ్యాం ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నివాసానికి వెళ్ళి ఆహ్వానించారు. మంత్రి కోమటిరెడ్డిని మంత్రి సీతక్క శాలువాతో సన్మానించారు. మంత్రి సీతక్క తన సొంత సోదరి లాంటివారని మంత్రి పేర్కొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు దెబ్బ

### అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 2కే రన్‌లో : జిల్లా కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో గురువారం 2కే రన్ నిర్వహించారు. మహిళా,శిశు,వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ,జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా ప్రజల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు ఎన్‌జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు 2 కిలోమీటర్ల రన్ చేపట్టాయి. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సంయుక్తంగా జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు, యువత, పోలీసు అధికారులు,ప్రజలతో కలిసి వారు కూడా రన్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును,కుటుంబాలను,సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని,ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,ప్రభుత్వ శాఖలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజ శాంతిభద్రతలకు కూడా ముప్పుగా మారుతుందన్నారు.డ్రగ్ ఫ్రీ నల్లగొండ,డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,డిఎస్‌పి శివరాం రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి,ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్లు మునగాల నాగిరెడ్డి, నవీన్, సునీల్, సీఐ నాగరాజు, ఎస్‌ఐలు సైదాబాబు,శివప్రసాద్, పోలీసు అధికారులు,సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాలపై కేసు నమోదు చేయాలి


**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ అనుమతి లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్న సెయింట్ అల్ఫోన్స్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దుప్పలపల్లి రోడ్డులో ప్రైవేటు భవనంలో పాఠశాల యాజమాన్యం విక్రయిస్తున్న పుస్తకాలను ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పట్టుకుని ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ అనుమతి లేకుండా పుస్తకాలు అమ్మడం చట్ట విరుద్ధమని అన్నారు.పుస్తకాలపై ముద్రించిన ధరల కంటే దాదాపు 50 శాతం అధిక ధరలకు యాజమాన్యం విక్రయిస్తూ విద్యార్థులను దోచుకుంటోందని ఆరోపించారు.పాఠశాల యాజమాన్యంపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్,జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్,అరవింద్ పాల్గొన్నారు.



## కాంట్రాక్టర్ చేతులొదిలేస్తే .... సర్పంచ్ రోడ్డు సరి చేశారు...



**ప్రజాపక్షం/డిండి;** తవక్లాపూర్ గ్రామంలో మూడు నెలల క్రితం రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సదరు కాంట్రాక్టర్ రోడ్డు మొత్తం తవ్వి ఊరి కూడలిలో ఏర్పడిన గుంతలు, పనులను మధ్యలో నిలిపివేడయంతో వర్షాలకు, వాహనాల తాకిడికి భారీ గుంతలు ఏర్పడ్డాయి. రెండు వారాల క్రితం కురిసిన వర్షాల కారణంగా ఆ గుంతలు పూర్తిగా నీటితో నిండిపోయి చెరువులను తలపించేలా ఉండి ప్రజలకు, వాహనదారుల రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. గుంతల లోతు తెలియక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా నిలిచిపోయిన నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్వాసన వ్యాపించి, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమస్యను సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య శనివారం స్పందించి గుంతలను మట్టితో పూడ్చే పనులు చేపట్టారు. వానొస్తే నీరు నిలవకుండా ప్రత్యామ్నాయ పనులు చేపట్టారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య ప్రజా సేవల పట్ల గ్రామ ప్రజలు వాహనదారులు, పరిసర ప్రాంత వాసులు అభినందనలు తెలిపారు.





## సన్న రకాలను రైతులు సాగుచేయాలి

### వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి

**ప్రజాపక్షం/చిట్యాల:** దొడ్డు రకాల స్థానంలో సన్న రకాల ధాన్యం పండించడానికి రైతులు ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర వ్యవశాఖ శాఖ డైరక్టర్ బి గోపి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విత్తనాలు, నానో యూరియా, నానో డిఐపి కౌంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రైతులతో ఆయన ముచ్చటించారు. సన్నరకాల వరి విత్తనాలను, నూనె ఉత్పత్తి పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని, అలాగే అవసరమైన యూరియా కూడా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వరి విత్తనాలు సేద్యం చేసినపుడే రైతులకు బోనస్ వస్తుందన్నారు. జనము పంటను పండించడానికి మండలంలో రైతులు ముందుకు రావడం హర్షనీయమన్నారు. జనము పండించాలనుకూనే రైతులు స్థానిక వ్యవసాయాధికారిని సంప్రదించాలని గోపి సూచించారు. అనంతరం పెద్ద కాపర్తి గ్రామంలో నగేష్ అనే రైతు వ్యవసాయ భూమిలో జనపనారు విత్తనాలను డ్రమ్స్ సీడర్ ద్వారా వేసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, మండల వ్యవసాయధికారి పి గిరిబాబు, ఏఈఓలు శిల్ప, మనీషా, శశాంక, పెద్ద కాపర్తి సర్పంచ్ ఎంపిటివో మనోహర్, కాటం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## డిసిఎం వ్యాన్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/నందికొండ :** విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిల్ కాలనీ ముత్యాలమ్మ ఆలయం దిగువ మలుపు వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్ర నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఏపీ16టీసీ6676 నంబరు గల డీసీఎం వాహనాన్ని డ్రైవర్ అతివేగంగా,నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ఏపీ07సీజే0436 నంబరు గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు.ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు కాళ్లు, చేతులు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి క్షతగాత్రులను హిల్ కాలనీలోని కామలా నెహ్రూ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని,ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై విజయపురి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ సిబ్బంది నర్ర గోపిరెడ్డి విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా కిందపడిపోయాడు. దీంతో అతన్ని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించగా సుమారు ఐదు లక్షల వరకు అవసరం ఉందని వైద్యులు చెప్పారు. దీంతో స్పందించి ముందుకు వచ్చిన ఉపాధి హామీ కూలీలు అందరి దగ్గర 21,700 రూపాయలను శనివారం నర్ర గోపిరెడ్డికి అందజేశారు. దాతలు స్పందించి నర్ర గోపిరెడ్డిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** విద్యుత్ షాక్‌తో సుమారు రూ.80వేల విలువైన పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. బాధిత రైతు నర్సింగ కృష్ణ జీవనోపాధి కోసం గేదెలను మేపుతూ పాలు అమ్ముకొని జీవిస్తున్నాడు. శనివారం ఉదయం కురిసిన వర్షానంతరం గేదెలను మేతకు వదలగా కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని రోధిస్తూ అధికారులను వేడుకున్నారు.

## సొంతింటి కల సాకారం



**ప్రజాపక్షం/చివ్వేంల :** ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం అవుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మున్యానాయక్ తండలో ధరావత్ వెంకన్న శారదల నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరన్న నాయక్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇంద్రాల నరసయ్య మరణించడంతో శుక్రవారం నరసయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సహకారంతో గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త, నాయకులు సోమనరసింహారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు నరసింహా, ఉపాధ్యక్షులు సోమయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** లయన్స్‌క్లబ్ 2026/27 సంవత్సరానికి నూతన కమిటి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మాజీ గవర్నర్ మెటివేటర్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ గోలి అమరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ సభ్యత్వమే మన గౌరవాన్ని, సేవాభావాన్ని సమాజంలో మరింత పెంచుతుందన్నారు. ప్రతి లయన్ సభ్యుడు సేవా కార్యక్రమాల్లో ముందుండి క్లబ్ సేవలను మరింత విస్తృత పర్చాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా షేక్ యూసఫ్, ప్రధాన కార్యదర్శిగా సరికొప్పుల నాగేశ్వరరావు, కోశాధికారిగా బదావత్ సైదులునాయక్ ప్రమాణస్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా నీలా శ్రీనివాస్, చిత్రం విశ్వనాథ్, మూలగుండ్ల వెంకటరెడ్డి, బసవ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటి సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తూ క్లబ్ న్ మరింత అభివృద్ధి పదంలో నడిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ కామ వెంకటేశం, రీజినల్ చైర్‌పర్సన్ ఏచూరి భాగ్యలక్ష్మి, కొణతం సీతరామిరెడ్డి, బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి, రాచకొండ రామ్మోహన్‌రావు, అంజయ్య, బాల వెంకటేశ్వర్లు, కందిబండ శ్రీనివాసరావు, జిలకర రామస్వామి పాల్గొన్నారు.

# ఈనెల 30 వరకు పొడిగింపు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రభుత్వ ఐటిఐ, ఎటిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లలో మొదటి విడత అడ్మిషన్ల దరఖాస్తుల గడువు ఈనెల 30వ వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు అసక్తి ఉన్న ట్రేడ్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏడాది కోర్సుల విభాగంలో ఇండ్రస్టియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నిషియన్ ట్రేడ్‌లో 40సీట్లు, మ్యాన్‌ప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నిషియన్ ట్రేడ్‌లో 40 సీట్లు, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నిషియన్ ట్రేడ్‌లో 20 సీట్లు, రెండేళ్ల కోర్సుల విభాగంలో మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ ట్రేడ్‌లో 24 సీట్లు, సిఎన్‌సి మెషినింగ్ టెక్నిషియన్ ట్రేడ్‌లో 24 సీట్లు, వర్చ్యువల్ ఎనాలిసిస్ అండ్ డిజైన్ టెక్నిషియన్ ట్రేడ్‌లో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్ ఎస్ఎస్‌సి మెమో, టిసి, స్టడి సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# గౌరవ డాక్టరేట్ అందుకున్న ముత్యంరాజు గురుస్వామి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆధ్యాత్మిక, సామాజిక సేవకులు, ఉద్యాన విస్తరణ అధికారి రంగు ముత్యంరాజు గురుస్వామి ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లో అందుకున్నారు. ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక అకాడమీ ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం యాజమాన్యం ఆయనకు ఉద్యానవనం, దైవత్వం, ఆధ్యాత్మికత, సామాజిక సేవ విభాగంలో ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన రంగు సత్తయ్య గౌడ్, బుచ్చమ్మ దంపతులకు మొదటి సంతానంగా 1977 మే 9న ముత్యంరాజు జన్మించారు. చిన్నతనం నుంచే సేవాభావం అలవర్చుకున్న ఆయన 1994లో నవోదయ యువజన సంఘాన్ని స్థాపించి మిత్రులతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భారత జాతీయ విద్యార్థి సంఘంలో క్రియాశీలకంగా పనిచేశారు. తనను గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసిన ఆసియా అంతర్జాతీయ సాంసృతిక అకాడమీ యాజమాన్యానికి ముత్యంరాజు గురుస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు పలువురు ప్రముఖులు, అయ్యప్ప భక్తులు, రైతులు అభినందనలు తెలిపారు.

## శ్రీకంఠమహేశ్వర స్వామి కల్యాణం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని దోసపహాడ్ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సూరమాంబ దేవి సమేత శ్రీ కంఠమహేశ్వర స్వామి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతల ప్రతిష్ఠ, కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరై స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితోపాటు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తుల సౌకర్యార్థం రూ. 5లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేయించారు. మండల పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్యుమరేషన్ ఫారాలను వార్డు సభ్యుడు సూరపల్లి వెంకటేష్ ఇంటింటికి వెళ్లి అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్ల నమోదు మార్పులు చిరునామ సవరణలు తొలగింపులు తదితర వివరాలను సకాలంలో నమోదు చేసుకునేందుకు ఈ పారాలు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు బూత్ స్థాయి అధికారులు, బిఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.






## జాబ్‌మేళాలో మెడల్ స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/నడిగూడెం:** జిల్లా కేంద్రంలో రాకేస్ బిఎడ్ కళాశాలలో శనివారం లక్ష్య జాబ్ స్కిల్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలలో మండలంలోని కరివిరాల గ్రామానికి చెందిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జాబ్ మేళాలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పలు కంపెనీల ప్రతినిధుల ఇంటర్వ్యూలను ఎదుర్కొని నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ కామెట్ స్టాఫింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలను సాధించారు. విద్యార్థులు ఉద్యోగాల సాధించడంలో ఆదర్శ పాఠశాల రిటైల్ ఒకేషనల్ ట్రైనర్ మధు పాత్ర ఎంతో ఉందని పలువురు కొనియాడారు. విద్యార్థులకు నిరంతరం శిక్షణ ఇస్తూ, వారిని ఉద్యోగాలకు సిద్ధం చేయడంలో మధు చూపుతున్న చొరవ అభినందనీయమని స్థానికులు, తల్లిదండ్రులు ప్రశంసించారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి, ఒకేషనల్ ట్రైనర్ మధు అభినందించారు.

## రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** రైతులందరూ సన్న రకాల విత్తనాలను సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి అన్నారు. శనివారం మండలంలోని కేసారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ వానాకాలం 2026 సీజన్‌లో వ్యవసాయ శాఖ ఏడు రకాల సన్న వరి రకాలను ప్రోత్సహిస్తోందన్నారు. ఆ రకాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందజేస్తుందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం మండలంలోని రైతు వేదికల్లో విత్తనాల పంపిణీ ఈనెల 30 వరకు కొనసాగుతుందన్నారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పోలీసుల విస్తృత తనిఖీలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల నిరోధించడంలో భాగంగా సూర్యాపేట పట్టణ పోలీసులు శనివారం యాంటి నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బందితో విద్యానగర్, 60 ఫీట్ల రోడ్డు, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న టీ దుకాణాలు, పాన్ షాపులు, హోటల్స్, లాడ్జిలు, హాస్టల్స్, పాఠశాలల నందు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలని కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణాపరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం కోసం విస్తృత తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడంలో భాగంగా కూడా తనిఖీ సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు, మాదక ద్రవ్యాలను గుర్తించే డాగ్ నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తనిఖీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.





## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని కొండాపురం గ్రామంలో పేద కుటుంబానికి చెందిన తూటి మల్లయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా కొండాపురం గ్రామపంచాయతీ పాలకవర్గం మృతుని కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల అవసరార్థం రూ.6,000 ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివ రాత్రి లావణ్య, ఉపసర్పంచ్ గోనె జహంగీర్, వార్డు సభ్యులు తూటి సుమలత మహేష్, తూటి రవికిరణ్, లింగాల సత్యం, బండారి స్వప్న కుమార్, గోధుమ కుంట మధు, కొండ పద్మ, దేవేందర్, కొండ పాండు, మాజీ సర్పంచ్ ధర్మారం యాదగిరి, బర్ల లచ్చయ్య, తూటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## నేడు పల్స్ పోలియో



**ప్రజాపక్షం/చిట్యాల:** పల్స్ పోలియోను వినియోగించుకునే వారిని నేడు నిర్వహించే పల్స్ పోలియో శిబిరాలకు విధిగా తీసుకు రావాలని నల్లగొండ జిల్లా చిట్యాల పిహెచ్‌సి డాక్టర్ ఈసం వెంకటేశం కోరారు. శనివారం రోజున పిహెచ్‌సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పిహెచ్‌సి పరిధిలో సుమారు 2,782 మంది 0 నుండి 5 సంవత్సరాల వయసు గల పిల్లలు పోలియో చుక్కలను వినియోగించుకోవల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేసేలా ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు చూసుకోవాలన్నారు. మొత్తం 17 పోలియో బూతులను ఏర్పాటు చేసినట్లు వెంకటేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది నర్సింగ్ రావు, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రతి పౌరుని గౌరవం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఓటు హక్కు ప్రతి పౌరుని గౌరవం, బాధ్యత అని తహశీల్దార్ నరేందర్ అన్నారు. కొండమల్లేపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో బిఎల్‌వోలు నిర్వహిస్తున్న కార్యక్రమంలో తహశీల్దార్ నరేందర్ పాల్గొని పరిశీలించారు. ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు వారికి సహకరించి నిజమైన సమాచారం ఇచ్చి ఎన్యూమరేషన్ ఫారంను నింపి ఇవ్వాలని అన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆధైర్య పడకుండా బిఎల్‌వోలకు సహకరించి ఓట్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వోలు కోట్ల శోభ, సిహెచ్. మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక భరోసా

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన గడుగు రాజమ్మ శుక్రవారం రాత్రి మరణించడం జరిగింది. మానవ సేవే మాదవ సేవ అనేన నినాదంతో ముందుకు వెళుతున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ విషయం తెలుసుకొని శనివారం రాజమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆర్థిక భరోసాగా రూ. 5016లలను అందజేయడం జరిగింది. ఉప సర్పంచ్ నగేష్, మాజీ ఎంపిటిసి మల్లయ్య పాల్గొన్నారు.

# 30న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్** : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని,లేనిపక్షంలో ఈనెల 30వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలలను బంద్ చేస్తామని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 8,9లను రద్దు చేసి,పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇంజినీరింగ్,ఫార్మసీ,పీజీ,డిగ్రీ తదితర కోర్సులు పూర్తయిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఏ కళాశాలకు వెళ్లి చూసినా విద్యార్థులు ఫీజులు కట్టలేక నరకయాతన అనుభవిస్తుంటే ప్రభుత్వం సంతోషంగా ఉందా అని ప్రశ్నించారు.లేని పక్షంలో ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నెల30న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌కు యాజమాన్యాలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప్పు లోకేష్,చేకూరి శివ,పోరపాటి కిషోర్,రూపాని చరణ్,కోన్ రెడ్డి మహేష్ రెడ్డి, వడ్లకొండ మనోహర్,కృష్ణ,నగేష్, రామన్న, మల్లికార్జున్,వెంకన్న,సురేష్,సతీష్,విజయ కుమార్,చెన్నూరు విజయకుమార్ పాల్గొన్నారు.

# స్పందించిన ఎమ్మెల్యే...ఎట్టకేలకు మరమ్మతులు!



**ప్రజాపక్షం/హాలియా** :జాతీయ రహదారి 167లో హాలియా నుండి దేవరకొండ వెళుతున్న దారి పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగించేది.ఈ దారిపై నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతూ పలువురు బాటసారిలు గాయాల పాలయ్యారు.ఈదారిపై ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన స్థానిక పాలకులు ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి గుంతల మయమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ బిటి రోడ్డు ఏర్పాటు చేయాలంటూ ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్పందించిన జాతీయ రహదారి నిర్వహణ అధికారులు తక్షణమే దేవరకొండ రోడ్డులో దెబ్బతిన్న రహదారికి గత రెండు రోజులుగా బీటీ వేసి మరమ్మతులు పూర్తి చేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.ఇన్నాళ్లకు ఈ గుంతలకు మోక్షం కలిగిందంటూ పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# కేశవులు ముదిరాజ్‌కు గ్రేట్ ఇండియా పార్లమెంట్ అవార్డ్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : సమాచార హక్కు పరిరక్షణ సమితి,ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ ప్రతిష్టాత్మక గ్రేట్ ఇండియా పార్లమెంట్ అవార్డ్‌ను అందుకున్నారు.దేశ రాజధాని న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్,ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అంబాసిడర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.సమాచార హక్కు పరిరక్షణ సమితిని స్థాపించి సమాచార హక్కు చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు,ఎలక్షన్ వాచ్ కమిటీ ద్వారా ఓటర్ చైతన్యం కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా కృషిచేస్తున్నందుకు గాను కేశవులు ముదిరాజ్‌కు ఈఅవార్డును ప్రదానం చేశారు.కార్యక్రమంలో భారత ప్రభుత్వ ఓబీసీ కమిషన్ సభ్యురాలు కిరణ్ మహాలే,ఆయుష్ శాఖ కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాదవ్,మెట్టు మధు,నోముల క్రాంతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామశాఖ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పాచిల్ల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖను శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య ఆదేశానుసారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త ఆధ్వర్యంలో పాచిల్ల గ్రామశాఖ నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. నూతన గ్రామ శాఖ అధ్యక్షులుగా అత్తి భాస్కర్, ఉపాధ్యక్షులుగా సిరిపురం పరుశరాములు, ప్రధాన కార్యదర్శిగా మహేష్, యాదయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా తూనం అరవింద్, ప్రచార కార్యదర్శిగా పరమేష్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులుగా మనోజ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా కృష్ణలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అరకొరగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్

**ప్రజాపక్షం/గుండాల;** ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయి నేటికి 20 రోజులు కావస్తున్నా నేటికి ప్రభుత్వ పాఠశాలలలో అరకొరగానే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని బాలల హక్కుల పరిరక్షణ జిల్లా కార్యదర్శి నీరటి పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠ్యాంశాలను నేర్చుకోవాలంటే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ వంటి కనీస వసతులను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## దివ్యాంగుల సాధికారతకు సెర్ప్ సమ్మిళిత దోహదం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగుల ఆర్థిక సామాజిక అభివృద్ధి లక్ష్యంగా సెర్ప్ (SERP) ఆధ్వర్యంలో హెలెన్ కిల్లర్ జన్మదినాని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యాదాద్రి భువనగిరి జిల్లా డిఆర్డిఏ ఏ పీ డి జంగారెడ్డి మాట్లాడుతూ హెలెన్ కిల్లర్ మహిళలు పేదరికం వికలాంగుల సమస్యలపై ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కిల్లర్ బహుళ వైకల్యం కలిగిన నాయకురాలు అని అన్నారు. చూపు, వినికిడి లోపం ఉన్న ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ముందుకు సాగారని ఆమె మహా వక్త, రచయిత్రి, కలిగిన వ్యక్తి అని కొనియాడారు. హెలెన్ కిల్లర్ ను ఆదర్శంగా తీసుకొని విభిన్న ప్రతిభావంతులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఏపీఎం శ్రీదేవి, ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు పందుల యాదగిరి, సూరపల్లి వెంకటేశం, మందుగుల బాలకృష్ణ, సీసీలు విష్ణు, సత్యనారాయణ, కృష్ణ, గడ్డం వెంకటయ్య, మహిళా సమాఖ్య సభ్యులు, వికలాంగుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమరభేరి బహిరంగ సభను విజయవంత చేయాలి



**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : జూలై ఐదవ తేదీన భువనగిరి లో జరిగే తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమరభేరి మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మిశెట్టి నరసింహులు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న కుల సంఘాల నాయకులను బిసి నాయకులను తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు బూడిద శ్రీనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చింతకింద ఉష, జిల్లా యువజన అధ్యక్షులు గుండబోయిన కృష్ణమూర్తి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లోజన్ నాయక్, భువనగిరి మండలం అధ్యక్షురాలు రోజా రాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాల శేఖర్, రాములు గౌడ్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా(సర్) ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ తుర్కపల్లి మండలంలో పారదర్శకంగా కొనసాగుతుందని బిఎల్‌ఏల సూపర్వైజర్ దేవరుప్పుల ఐలయ్య అన్నారు. మండలంలో 61 నుంచి 70వ బూతు వరకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తనను కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఏలకు సూపర్ వైజర్‌గా నియమించడం జరిగిందని, అందులో భాగంగా తుర్కపల్లి, దత్తాయపల్లి, ముల్కపల్లి మూడు గ్రామాల్లో సర్ ప్రక్రియలో పాల్గొనడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సోమల్ల వెంకటేష్, జేరిపోతుల కరుణాకర్, బూలీ వీరన్న, ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, బిఎల్ఏ, గొప్ప కొండల్ రెడ్డి, ద్యానబోయిన ప్రవీణ్, బొల్లారం జగదీష్, పాముల రాజు, రాసాల జీవన్ యాదవ్, బిఎల్‌ఓలు బాగ్య, రాణి పాల్గొన్నారు.





# జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా అనిత

**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా అనిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన లక్ష్మణ్ నాయక్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లగా జనగాం నుండి ఆమె సూర్యాపేట జిల్లాకు వచ్చింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## బిసి యువజన సంఘం జాతీయ కార్యదర్శిగా సైదబాబు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** బిసి యువజన సంఘం జాతీయ కార్యదర్శిగా మండలంలోని తంగెళ్ల గూడెం గ్రామానికి చెందిన చందా సైదబాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ శనివారం హైదరాబాద్‌లోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా సైదబాబు మాట్లాడుతూ బిసి సంఘం బలోపేతానికి కృషి చేస్తూ యువకులను చైతన్యపరిచి గ్రామ గ్రామాన కమిటీలు వేసి యువజన సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడం కృష్ణ, సతీష్, నవీన్ పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ బి. నగేష్ అన్నారు. శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన, ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల పిల్లల వరకు తప్పనిసరిగా వేయించాలని కోరారు. ఈ పోలియో కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలు నాయక్, డిప్యూటీ తహశీల్దార్ అశ్విని, సూపర్‌వైజర్ లలిత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనిత, నర్సింగ్ ఆఫీసర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్లకు ఎనిమినేషన్ ఫామ్ అందజేత

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల కేంద్రంలో రంగాపురం గ్రామంలో శనివారం ప్రభుత్వ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటు నమోదు కొరకు సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఓటర్లకు ఎలిమినేషన్ ఫాం అందజేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ గోలి నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు బుర్రి సుదర్శన్, యువజన కాంగ్రెస్ నాయకులు ఉప్పలంచి శ్రీకాంత్, బిఎల్ఓ దాతరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకు సహకరించాలి



**ప్రజాపక్షం/హాలియా:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటికి వచ్చే బిఎల్‌వో లకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. గురువారం ప్రారంభమైన ఓటరు జాబితా సవరణ వచ్చే నెల 24 వరకు జరుగుతుందని దీనిలో భాగంగా శనివారం 163 బూతులో బిఎల్వోలు చేపట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఎన్యుమరేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఇందులో భాగంగా బిఎల్వోలు సూపర్వైజర్లు ఇంటింటికి వచ్చి ఓటరు ఎనిమరేషన్ ఫామ్స్ ఇస్తారని దానిలో ఉన్న వివరాలను నమోదు చేసి అవసరమైన డాక్యుమెంట్లు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. 2022 లో నిర్వహించిన సవరణ కార్యక్రమం ఆధారంగా తీసుకొని మ్యాపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు ఎక్కడ నివాసం ఉంటే అక్కడ ఓటర్ నమోదు చేసుకోవచ్చని సూచించారు.ఈకార్యక్రమంలో బిఎల్ఓ అనిల్ కుమార్ మజహార్ మొయినుద్దీన్,కున్ రెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 29న జరిగే అభినందన సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/రామన్నపేట :** పర్యావరణ పరిరక్షణ వేదిక సమావేశం శనివారం రహదారి బంగ్లాలో జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో కన్వీనర్ ఎండి రెహాన్, ఊట్కూరు నరసింహ, ఫజల్, రాజు, నోముల చిరంజీవి మాట్లాడుతూ రామన్నపేట మండలంలో ప్రతిపాదించిన అంబుజా సిమెంట్ కంపెనీ రద్దు కావడం పట్ల ప్రజల పోరాట విజయం అన్నారు. పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 29న సోమవారం ప్రజల విజయాన్ని కాంక్షిస్తూ అభినంద సభ నిర్వహిస్తున్నట్లు వేదిక నాయకులు తెలిపారు. ఈ అభినంద సభకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం హాజరవుతున్నారు. అలాగే వివిధ పార్టీల నాయకులు పాల్గొంటున్నారు. కావున మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి ప్రజా ప్రతినిధులు యువతీ యువకులు విద్యార్థులు వ్యాపారస్తులు మేధావులు విద్యాసంస్థ యజమాన్యాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కందుల హనుమంతు, ఎండి జమీరుద్దీన్, బత్తుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పర్యటనను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఈ నెల 29న వరంగల్ లో పర్యటించే బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వరంగల్ పర్యటనను విజయవంతం చేయాలనే లక్ష్యంతో శనివారం జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో తుర్కపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు తొలిసారిగా విచ్చేస్తున్న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పర్యటన చారిత్రాత్మక ఘట్టమని, ఆయన రాకతో తెలంగాణలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నిండుతుందని పేర్కొన్నారు. ప్రతి మండలం, ప్రతి శక్తి కేంద్రం, ప్రతి బూత్ నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చేలా ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని, పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిద్దె రాములమ్మకు నివాళి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మండలంలోని ఎర్కారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దె అంజయ్య సతీమణి మిద్దె రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శనివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటిగొర్ల శ్రీను యాదవ్, ఉపసర్పంచ్ రెడ్డి నాగిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కట్టెబోయిన మల్లయ్య, మాజీ ఎంపిటిసి వెంకన్న, నాయకులు మోదల గంగయ్య, మిద్దె కిరణ్, మిద్దె రమేష్ పాల్గొన్నారు.



## ఓటరు నమోదుపై అవగాహన

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని కుంకుడుపాముల గ్రామంలో శనివారం సర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్, సూపర్ వైజర్ వంశీ ముఖ్య అతిథులుగా పాల్గొని, గ్రామ ఓటర్లకు ఓటరు నమోదు ఫారమ్లను ఎలా నింపాలో, వాటిని ఎలా సమర్పించాలో క్షుణ్ణంగా వివరించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండి ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ విజయ లలిత మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## ప్రభుత్వ బడిపై నమ్మకం కుదిరింది

**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నూతన చేరికలు 105 చేరిన సందర్భంగా విద్యార్థులతో కలిసి 105 నెంబర్ సింబాలిక్ దృశ్య కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి సలీంషరీఫ్ తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్ల విద్యార్థులు తల్లిదండ్రుల సహకారంతో గత విద్యా సంవత్సరం సాధించిన ఫలితాలు నిర్వహించిన కార్యక్రమాలతో పాఠశాలపై తల్లిదండ్రులకు నమ్మకం కుదిరింది. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో మరింత సమిష్టి కృషితో జిల్లాస్థాయిలో టాఫర్‌గా అత్యున్నత ఫలితాలు సాధనతో పాటు విద్యార్థులందరికి నాణ్యమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని చిన్న లక్ష్మాపూర్ గ్రామంలో తమ తల్లిదండ్రులు కాకి జయప్రదలక్ష్మయ్య గౌడ్ జ్ఞాపకార్థం కార్తికేయ ప్రాజెక్ట్స్, డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాకి గంగాధర్ గౌడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష్ భాస్కర్ రెడ్డిల ఆధ్వర్యంలో పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంతోష్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు దాతలు నోట్ బుక్స్ అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూడవత్ పార్వతీ చిన్న నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్, వార్డు సభ్యులు సరిత రమేష్, సునీత నవీన్ రెడ్డి, ఓర్సు రాములు, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ మాధవి, వివోఏ.కవిత పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియపై బిఆర్ఎస్ సమావేశం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని పలు గ్రామాల్లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియ పై బిఆర్ఎస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఎరుకల సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ అర్హత గల ఓటర్లను చైతన్యపరిచి జాబితాలో ఓటు నమోదును బిఎల్ఓ ఇచ్చిన ఫారంలో నమోదు చేసుకోవాలని కోరారు. శనివారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఎల్‌ఏల సమావేశం నిర్వహించారు. టిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు అర్హత గల ఓటర్లు పేరు జాబితాలో ఉండేలా టిఆర్ఎస్ బిఎల్ఏలు కృషి పనిచేయాలని సూచించారు. అలాగే ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్ మల్లగారి శ్రీనివాస్ గుప్తా, మంచాల రవికుమార్ కులం దేవేందర్ రెడ్డి, టంటం భార్గవ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎంజియు పార్ట్‌టైం లా అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటైన లా కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్ట్‌టైం అధ్యాపకుల ఎంపికకు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. ఎల్‌బి,ఎల్‌ఎల్‌ఎం విభాగాల్లో ఫ్యామిలీ లా,కాన్స్టిట్యూషనల్ లా,లాఆఫ్ కాంట్రాక్ట్,లాఆఫ్ టార్ట్, ఎన్విరాన్‌మెంటల్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా స్పెషలైజేషన్లలో పార్ట్‌టైం అధ్యాపకుల ఎంపిక జరగనుంది. ఎల్‌ఎల్‌ఎంలో కనీసం 60 మార్కులతో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కలిగిన విశ్వవిద్యాలయాల నుంచి సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, బోధనా అనుభవం కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను జూలై 10వ లోపు రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని రిజిస్ట్రార్ తెలిపారు.

# నీటి సంరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపుదలలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. జల శక్తి అభియాన్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం నీటి సంరక్షణపై అవగాహన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ వి.వెంకటేశం మాట్లాడుతూ ఎండ వేడిమిని తట్టుకోవాలన్నా, వాతావరణ సమతుల్యత ఉండాలన్నా వర్షాలు అవసరమని తెలిపారు. సరైన పంటలు పండాలన్నా,చెరువులు, కుంటలు నీటితో నిండాలన్నా ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలని సూచించారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సంరక్షించుకోవాలని కోరారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి ఏపీఓ జయరాజు మాట్లాడుతూ ఫ్లోరైడ్ ప్రభావిత బాధితుల గురించి వివరిస్తూ వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలన్నారు.చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఎంఈఓ నీటి సంరక్షణ అధికారులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు జూలై 5 లోపు దరఖాస్తులు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** వానాకాలం 2026 సీజన్‌కు గాను నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని నార్కట్‌పల్లి మండల వ్యవసాయ అధికారి కే.గౌతమ్ శుక్రవారం తెలిపారు.జూన్ 15,2026 వరకు కొత్త పాస్‌బుక్స్ వచ్చిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు.దరఖాస్తు ఫారంతో పాటు పాస్‌పుస్తకం జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ జతపరిచి సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారికి జూలై 5,2026లోగా సమర్పించాలని సూచించారు.గతంలో రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకుని నిధులు జమ కాని రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని,ప్రస్తుతం పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఎంఏఓ స్పష్టం చేశారు.

# సర్వసభ్య సమావేశానికి కుమ్మరులు తరలిరావాలి

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో నేడు జరిగే మండల కుమ్మరి సంఘం సర్వసభ సమావేశానికి మండలంలోని కుమ్మరులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కుమ్మర సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు బోనంకుర మల్లేష్, కుమ్మర సంఘం మండల అధ్యక్షులు బేతాళ శ్రీనివాసులు, కుమ్మర సంఘం మండల ప్రధాన కార్యదర్శి బేతాళ బాలరాజు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ కుమ్మరులు రాజ్యాధికార దిశగా పోరాటం చేయడానికి ఈ సభ ఎంతగానో ఉపయోగపడుతుందని కుమ్మరులు వారి హక్కుల కోసం పోరాడేందుకు ఈ సర్వసభ్య సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఓరుగంటి గోపాల్, ప్రధాన కార్యదర్శి ధర్పల్లి ప్రవీణ్, తాడూరి ఆంజనేయులు, వెంకటేష్, గుముడేల్లి భాస్కర్ హాజరవుతున్నారని మండలంలోని కుమ్మరి సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మూసీ మత్స్య సహకార సంఘం డైరెక్టర్లు గైర్హాజరు..

## ఆఫీస్ బేరర్ల ఎన్నిక వాయిదా



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మూసీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆఫీస్ బేరర్ల ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి కే.శ్రీరామ్ తెలిపారు.శనివారం మండలంలోని వల్లభాపురం గ్రామపంచాయతీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 25న మూసి మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు.ఈఎన్నికలలో 13 మంది డైరెక్టర్లు గెలుపొందారని పేర్కొన్నారు. గెలుపొందిన డైరెక్టర్లను ఈనెల 27న వల్లభాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం కావాలని ప్రతి డైరెక్టర్‌కు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి నిర్ణయించిన సమయానికి డైరెక్టర్లు హాజరు కాకపోవడం వల్ల ఎన్నిక ను తదుపరి రోజుకు వాయిదా వేయాల్సి ఉందని తెలిపారు. కానీ ఈనెల 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయలేమని పోలీస్ శాఖ తెలిపిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర సహకార ఎన్నికల సంఘానికి తెలుపుతామన్నారు.వారు నిర్ణయించిన ప్రకారం ఎన్నిక జరిగే తేదీని తిరిగి ప్రకటించే వరకు ఆఫీస్ బేరర్ల ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

# సహాయక సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సెర్ప్ లక్ష్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు పెట్టుబడులు అందించి ఆర్థికంగా వారిని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సెర్ప్ అధికారులు సమీక్ష నిర్వహించారు.బుధవారం మండల మహిళా సమాఖ్య సెర్ప్ కార్యాలయంలో చింతపల్లి,నాంపల్లి,మర్రిగూడ మండలాల సహాయక ప్రాజెక్టు నిర్వాహకులు,క్షేత్ర స్థాయి సమన్వయకర్తలు,వ్యాపార అభివృద్ధి సేవా ప్రదాతలు,మార్గదర్శకులు,జిల్లా శిక్షణ నిపుణులతో హైదరాబాద్ సెర్ప్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది.వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు,వారికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు.ఈ సమావేశంలో హైదరాబాద్ సెర్ప్ నుంచి సంస్థాగత స్థిరత్వ నిధి కార్యక్రమ నిర్వహణాధికారి ప్రధ్యుమ్న,సంస్థాగత స్థిరత్వ నిధి ఇందిరా బాలకృష్ణ,మధుసూదన్ రెడ్డి,మండల సమాఖ్య అధ్యక్షురాలు,అధికారుల బృందం ఉన్నారు.

# రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం స్థానిక సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాణ్యత లేని రోడ్డు నిర్మాణం చేయించాడని ఆరోపించారు.నల్లగొండ జిల్లాలో ఏం అభివృద్ధి చేశారని నేడు జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తూ తామే అభివృద్ధి చేశామని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలోని 12 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓడిపోవడం ఖాయం అన్నారు.ఈసమావేశంలో ఆ పార్టీ జిల్లా నాయకులు తాటిపాముల శివకృష్ణ గౌడ్,నకిరేకంటి మొగులయ్య,మండల వెంకన్న,యానాల శ్రీనివాస రెడ్డి,పందాల సైదులు,వనం అంజయ్య, చినేని జానీ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రత తొలగింపుపై స్వేరోస్ నిరసన




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నల్లగొండలో స్వేరో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు.ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుమల సురేష్ మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ భద్రత తొలగింపు వెనుక ఉన్న అంతర్యమేమిటో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సమాజానికి తెలపాలని డిమాండ్ చేశారు.భద్రత తొలగించి ఆయనను ప్రభుత్వమే హత్య చేయాలని చూస్తోందని ప్రజలు భావిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ నాయకులు కలకొండ చరణ్,వినోద్,వసంత్, భరత్,యాచారం శ్రవణ్,ఏసు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద పెన్షన్‌దారులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల అటెండెన్స్ కు ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ కోటగిరి శ్రీనివాస్ సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపి రెడ్డి, కార్యదర్శి సూర్య చంద్రరావు, కోశాధికారి అండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




# జానపద గేయాలు.. ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు...

**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ టూరిజం, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ప్రాంగణంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు వినోదంతో పాటు తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేవరకొండకు చెందిన బంజారా కళాకారులు ప్రదర్శించిన గిరిజన నృత్యా లు, నల్లగొండకు చెందిన రమేష్ బృందం ఆలపించిన జానపద గేయాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల ఉత్సాహభరిత ప్రదర్శనలకు ప్రేక్షకులు చప్పట్లతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర,విజయ విహార్ మేనేజర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పర్యాటకులకు చేరువ చేసే ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.




# యువత చేయూత

**ప్రజాపక్షం/డిండి;** యువత చేయూత అనే నినాదంతో శనివారం డిండి గ్రామంలో మరణించిన మీసాల కుమార్ కుటుంబ సభ్యులను చేయూత సభ్యులు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందజేయడం జరిగింది.



## ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడిచిపోతున్నా, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు ఇంటర్మీడియట్ బోర్డు ఇంతవరకు గుర్తింపు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర అయోమయంలో ఉన్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులుగౌడ్ శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు తక్షణమే స్పందించి ప్రైవేట్ కళాశాలల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిజానికి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ జూనియర్ కళాశాలల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండగా, నేటికీ పూర్తి చేయకుండా జాప్యం చేయడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ ఆలస్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే అఫిలియేషన్ ప్రక్రియను ముగించాలని కోరారు. దేశంలో విద్యా హక్కు చట్టాన్ని కాపాడాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వం మరియు ఇంటర్మీడియట్ బోర్డ్ పైనే ఉందని ఆయన గుర్తు చేశారు. విద్యాశాఖ బాధ్యతలు స్వయంగా ముఖ్యమంత్రి దగ్గరనే ఉన్నందున, ఆయన ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గందరగోళం నుండి తప్పించాలని కోరారు.

## రాజ్యాధికార సమరభేరి ఆహ్వాన పత్రిక

**ప్రజాపక్షం/రామన్నపేట :** చలో భువనగిరి సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రామన్నపేట మండల అధ్యక్షులు కల్లెం ఉపేందర్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎం.ఈ.ఓ.బొడ్డు వెంకశంకి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి పసల ప్రసన్న ముఖ్య అతిథిగా హాజరై సమరభేరి సభ లక్ష్యాలు, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధన, బీసీఎస్సీఎస్టీమైనారిటీల ఐక్యతపై వివరించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకశం ఎంతో సంతోషంగా స్పందించి, రాజ్యాధికార సమరభేరి విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, తమ పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్, సుశీల, యాదగిరిగుట్ట మండల మహిళా అధ్యక్షురాలు పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** త్రాగునీటి సమస్యకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డికి 15వ వార్డు కౌన్సిలర్ శ్రీజ కాలనీ వాసులతో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీ లో గత కొద్ది రోజుల నుంచి త్రాగునీరు రావడంలేదని దీంతో ప్రజలు త్రాగునీరుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట కాలనీ వాసులు ఉన్నారు.



# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీ ఆపలేరా?



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో అడ్డగోలుగా పెంచిన ఫీజులను, పాఠశాలల ప్రాంగణాల్లోనే నిర్వహిస్తున్న పుస్తకాల విక్రయాలను తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీసీ యువజన సంఘం నాయకులు పట్టణంలో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ.. మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజులు పెంచేసి, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేవలం డబ్బే లక్ష్యంగా దోపిడీ చేస్తున్న యాజమాన్యాలపై పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నా అధికారులలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ప్రస్తుత రోజుల్లో పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించాలంటే తల్లిదండ్రులు తమ భూములు, బంగారం అమ్ముకోవాల్సిన దుస్థితి మిర్యాలగూడలో ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మిర్యాలగూడలో ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కా నాగేశ్వరరావు, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లావూరి రవీందర్ నాయక్, బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు పట్టేటి రమేష్, నియోజకవర్గ నాయకులు మునగాల శైలేందర్, పట్టణ నాయకులు లక్ష్మ ణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వానకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా మిర్యాలగూడ పట్టణంలోని పలు ప్రైవేట్ విత్తన విక్రయ కేంద్రాలపై వ్యవసాయ శాఖ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి మేకల ఋషేంద్రమణి నేతృత్వంలోని బృందం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న విత్తన దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో భాగంగా రైతుమిత్ర విత్తన దుకాణం, చీదళ్ల అనంతరాములు అండ్ సన్స్ షాప్, యొద సీడ్స్‌లలో నిల్వ ఉంచిన వరి విత్తనాల స్టాక్‌ను, వాటికి సంబంధించిన రికార్డులను, బిల్ బుక్కులను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మేకల ఋషేంద్రమణి మాట్లాడుతూ ప్రైవేట్ యాజమాన్యాలు లాభార్జనే ధ్యేయంగా కాకుండా రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాపారం చేయాలని సూచించారు. ప్రస్తుతం తాము తనిఖీ చేసిన దుకాణాలలో ప్రభుత్వం నిర్దేశించిన, ధృవీకరించిన 7 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. అయితే విత్తనాల నాణ్యతను మరింత నిర్ధారించుకోవడానికి ఆయా షాపుల నుండి వరి విత్తనాల నమూనాలను సేకరించామని, వీటిని పరీక్షల నిమిత్తం తక్షణమే సీడ్స్ టెస్టింగ్ లేబొరేటరీకి పంపుతున్నట్లు వెల్లడించారు. మార్కెట్లోకి నకిలీ, నాసిరకం విత్తనాలు సరఫరా చేసి అమాయక రైతులను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు దుకాణాల లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తామని హెచ్చరించారు.

# భక్తిశ్రద్ధల మధ్య ధ్వజస్థంభ ఊరేగింపు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని హౌసింగ్ బోర్డు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న ధ్వజస్థంభ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ధ్వజస్థంభ ఊరేగింపులో మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రారంభమైన ధ్వజస్థంభ ఊరేగింపు ఆలయ పరిసర ప్రాంతాల్లో వైభవంగా సాగింది. మహిళలు మంగళహారతులు పట్టగా, భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపును విజయవంతం చేశారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొని కోలాట ప్రదర్శనలో భాగస్వామ్యమయ్యారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని పేర్కొన్నారు. మహాలక్ష్మి అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు మంచి పంటలు పండించాలని, యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు




**ప్రజాపక్షం/రామన్నపేట :** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలకమిటీ ఆధ్వర్యంలో నాగు నరసింహ అధ్యక్షతన హెలెన్ కెల్లర్ 146 వజయంతి వేడుకలు నిర్వహించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పిఆర్‌డి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధానకార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా హెలెన్ కెల్లర్ 146వ జయంతిని నిర్వహించారు. వికలాంగుల జీవితాల్లో సంఘసంస్కర్త రచయిత. విద్యావేత్త 146వ జయంతి సందర్భంగా ఆ మహనీయురాలికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలోఎన్‌పిఆర్‌డి మండల సహాయ కార్యదర్శి పున్న శ్రీధర్, మండల కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నరసింహ, మచ్చగిరి అంజయ్య, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండల లీగల్ సర్వీసెస్ కమిటీ రామన్నపేట ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రామన్నపేటలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.శిరీష హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ విలువలు, పౌరుల ప్రాథమిక విధులు, బాలల హక్కులు మరియు బాల కార్మిక వ్యవస్థ నివారణ, బాలలపై జరిగే దుర్వినియోగాల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన, సేఫ్ టచ్ అన్సేఫ్ టచ్, సైబర్ భద్రతతో పాటు ఇతర ముఖ్యమైన న్యాయ అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని, తమ హక్కులు మరియు విధులను తెలుసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎస్.శిరీష సూచించారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## పెన్షనర్లను వంచిస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం జూన్ 25న ప్రగల్భాలతో ప్రారంభించిన నూతన ఇన్సూరెన్స్ పథకం వల్ల రాష్ట్రంలోని 3 లక్షల మంది పెన్షనర్లకు ఎలాంటి లాభం లేదని టాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర విమర్శించారు. శనివారం మిర్యాలగూడలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లు రూ.1.20 కోట్ల బీమా పెన్షనర్లకు వర్తించదని, ఫైనాన్స్ శాఖ తెచ్చిన ఈ ప్రమాద నివారణ పాలసీ కేవలం సెంట్ సత్కార్, ఇండియన్ బ్యాంకుల ద్వారా వచ్చే పెన్షన్ ఆధారంగా మాత్రమే వర్తిస్తుందని మండిపడ్డారు. ఇది 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఎంతమాత్రం ఉపయోగపడదన్నారు. మెరుగైన హెల్త్ పాలసీ తెస్తామని నమ్మించి ఇప్పటికే పెన్షన్‌లో 1.5శాతం కోత పెట్టారని, మరో ఐదు రోజుల్లో రెండో విడత కోతకు సిద్ధమవడం దారుణమన్నారు. ఐదు డిఏలు, పీఆర్‌సీ నివేదికలను పక్కనబెట్టి కాలయాపన చేయడంపై మండిపడ్డారు. జాయింట్ యాక్షన్ కమిటీ తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల అభిప్రాయాలతో కార్యాచరణ రూపొందించాలని కోరారు. టాప్రా నాయకులు మల్లు గౌతంరెడ్డి, ఎం.లక్ష్మీనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

## మల్లమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించిన కైలాష్ నేత

**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు మండల కేంద్రానికి చెందిన ప్రజాపక్షం విలేఖరి దొమ్మాటి కృష్ణ నానమ్మ దొమ్మాటి మల్లమ్మ దశదిన కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత హాజరై మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుమారుడు దొమ్మాటి సత్తయ్య,సుగుణ,దొమ్మాటి కృష్ణ ఉన్నారు.

